# మినీ కథలు

## రాంగ్ నంబర్

**ఆఫీసు :**

"ట్రింగ్....ట్రింగ్....

"హలో."

"హలో! ఈజిట్ ఆఫీసర్స్ క్లబ్?"

"సారీ. రాంగ్ నంబర్".

"ట్రింగ్....ట్రింగ్...."

"హలో."

"హలో, సాయంత్రం మన క్లబ్‌లో సినిమా ఏమిటి?"

"రాంగ్ నంబర్".

"ట్రింగ్....ట్రింగ్... "

"హలో. మోహన్ స్పీకింగ్".

"ఏమేవ్ మోహినీ. నన్ను 'ఏక్ దూజే కేలియే'కి రమ్మని. నిన్న నువ్వు రాలేదు. ఏ బోయ్ ఫ్రెండన్నా తగిలాడా ఏమిటి?"

"సారీ. రాంగ్ నంబర్"

ట్రింగ్....ట్రింగ్....

"హలో మదనోమ్మహన్ హియర్."

"గుడ్ మార్నింగ్. రాజశేఖరం దిస్ సైడ్."

"గుడ్ మార్నింగ్. హౌ ఆర్ యూ?"

"ఫైన్. బై దిబై. వెంకటేశ్వరాలో రేపు మార్నింగ్ షో ఏమిటి?"


"జస్ట్ ఎ మినిట్ "

"థాంక్యూ" ఫోన్ పెట్టేసిన చప్పుడు.

* * *

**ఇల్లు:**

"నాన్నారూ! నేను పెద్దయ్యాక డాక్టర్నవుతాను"



"రాంగ్ నంబర్ బాబూ" (మనలాంటి మధ్యతరగతివాళ్ళకు అంత పెద్ద ఆశలుండకూడదు)

"డాడీ! 'ఆ' అంకుల్‌లా మీరు కూడా స్కూటర్ ఎందుకు తీసుకోరు?"

"రాంగ్ నంబర్ బేబీ (ఆయనలాగా నేను కూడా లంచాలు తీసుకుంటే స్కూటరేం ఖర్మ. కారే కొనవచ్చు).

"ఏమండీ! ఎదురింటావిడ రాళ్ళనెక్లెస్ తీసుకుంది. ఎంత బావుందనుకున్నారు! నేను కూడా...."

"రాంగ్‌నెంబర్ డార్లింగ్ (నువ్వుకూడా రచయిత్రివైతే బాగుండేది. మరి కాదే?)

* * *

**అనుపత్రి :**

"ఈ ఇంజెక్షన్ వేసుకోండి" తియ్యగా అంది నర్స్.

"క్షమించండి సిస్టర్. ఆ మందు టి.బి. పేషెంటు కివ్వాల్సింది. రాంగ్ నంబర్" అన్నాను. ఆశ్చర్యంగా నావంక చూస్తూ ముందుకి కదిలిందా నర్స్.

**ప్రైవేట్ క్లినిక్ :**

"కంగ్రాచ్యులేషన్స్ మోహన్. మీరు మళ్ళీ తండ్రి కాబోతున్నారు" అంది లేడీ డాక్టర్. శ్రీమతి వంక చూశాను. సిగ్గుతో. ఆనందంతో ఆమె చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"రాంగ్ నంబర్" నాలో నేనే సణుక్కున్నాను. ఎందుకంటే నేను రెండు సంవత్సరాల క్రితమే వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను.

—పి. ఏడుకొండలస్వామి

## ప్రిస్టేజి

పండగ పూట అయిపోయిన కాల్ గ్యాస్‌ను. బ్లాకులో కూడా దొరకట్లేని కిరోసిన్‌ని. చెడిపోయిన ఫోనుని తిట్టుకుంటూ కూర్చుంది మీనాక్షి. ఫోను బాగయ్యేదాకా గ్యాసు తెప్పించుకునే యోగం లేదు. 'ఊరికి దూరం....వద్దు ... అంటున్నకొద్దీ 'డీసెంట్ లొకాలిటీ. ప్రశాంతంగా వుంటుందంటూ ఈ అడవిలో పడేసిన శ్రీహరిమీద పీకలదాకా కోపం వచ్చింది. ఆ పూట తిండెట్లా అన్న విచారమటుంచి. తన ముగ్గురు ఫ్రెండ్స్ ప్రేమగా పంపించే పిండివంటలకు రెస్పాన్సుగా తనేమి పంపించాలాఅన్న విచారం పట్టుకుంది. ఏమి పంపకపోతే తన ప్రిస్టేజి ఏంగాను?

"కిరసనాయిల్ స్టాక్ చెయ్యి. గ్యాస్ స్కేర్సిటీ ఉన్నన్నాళ్ళు" అని శ్రీహరి చెప్తున్నా.... కేర్‌లెస్‌గా ఉన్నందుకు వందోసారి తిట్టుకుంది. రెండురోజుల తరువాత క్యాంపునుంచి వచ్చిన శ్రీహరికి పండగ పూట గ్యాసు అయిపోయిన సంగతి. తరువాత గ్యాసు ఎంత తంటాలుపడి తెప్పించుకున్నదీ చెప్పింది భోజనం మధ్యలో. హోటల్స్ కనుచూపుమేర దూరంలో కూడా లేవని గుర్తొచ్చి. ఆరోజు భోజనం చేశావా అని అడిగాడు ఆదుర్దాగా.

శ్రీహరి ఆదుర్దాపడుతుంటే లోపల సంతోషిస్తూ "పండగ కదా.... మా విశాల గులాబ్‌జామ్. లక్ష్మి బొబ్బట్లు. సౌజన్య పులిహోరా కష్టపడి అంతదూరం నుంచి పంపించారు. అవి తిని ఆ రోజు పస్తుండకుండా తప్పించుకున్నాను" అంది దిగులుగా మొహంపెట్టి.



భార్య పడిన అవస్థ తలుచుకుని జాలి పడ్డాడు శ్రీహరి. ఆమె పండగ పూట పస్తుండకుండా తెలియకుండానే సహాయపడ్డ మీనాక్షి స్నేహితురాళ్ళమీద కృతజ్ఞతా భావం వచ్చేసింది.

"పోనీలే పండగ పూట నీకు రకరకాల పిండివంటలు తినే ప్రాప్తం కలిగించారు. ఇప్పుడు గ్యాసు ఉందిగా.... మంచి పిండివంటలు చేసి వాళ్ళకి పంపించు" అన్నాడు సిన్సియర్‌గా.

"ఇప్పటిదాకా ఆగుతానా.... ఆ రోజే పంపించేశాను" అంది మీనాక్షి కళ్ళు త్రిప్పుతూ.

"ఆ రోజు గ్యాసు రాలేదన్నావుగా.... ఎలా పంపించావు" అడిగాడు శ్రీహరి ఆశ్చర్యంగా.

"వాళ్ళకి ఒకళ్ళకొకళ్ళు తెలియదుగా అందుకని విశాల పంపిన వాటిలో కొన్ని సౌజన్యకి. సౌజన్య పంపిన పులిహోర కొంచెము లక్ష్మికి. లక్ష్మి పంపిన బొబ్బట్లు ఆరు విశాలకి పంపించాను. మర్నాడు ముగ్గురూ ఫోను చేసి నేను చేసి పంపినవి బ్రహ్మాండంగా వున్నాయంటూ మెచ్చుకున్నారండి...." అని ఆనందంగా చెప్తున్న మీనాక్షి మాటలు విని పొలమారింది శ్రీహరికి.

—హేమమాలిని